

పదిలమేనా ?

పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధన కష్టంగా కనిపిస్తోంది. నూరు రోజుల కార్యాచరణను ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. 10లో ▸



బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీల్లో పాల్గొనే ఆదికవి నన్నయ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ మహిళల జట్టును ఏలూరులో ఎంపిక చేశారు. 10లో ▸



నిలిచిన వంతెన పనులు

గోదావరి కాల్వపై వారధి నిర్మాణానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. నీటి ప్రవాహానికి ఆటంకాలపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 10లో ▸

సచివాలయ వ్యవస్థపై కత్తి

గ్రామ స్వరాజ్యానికి తూట్లు

- వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కూటమి ప్రభుత్వ నిర్ణయాలు
- ఉద్యోగులపై వేధింపులు
- అటెండెన్స్ సరిగా లేదనే సాకు
- జిల్లాలో 1,829 మందికి నోటీసులు !
- వలంటీర్ల పనులన్నింటినీ సచివాలయ సిబ్బందితో చేయిస్తున్న వైనం



ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్లలో గ్రామ సచివాలయం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ఆవిర్భవించిన సచివాలయ వ్యవస్థపై కూటమి సర్కారు కత్తి పట్టింది. ఉద్యోగులను టార్గెట్ చేసి వేధింపుల పర్వానికి శ్రీకారం చుట్టింది. పనిభారం పెంచడం, సంబంధం లేని విధులు కేటాయించడం, వలంటీర్లను తొలగించి ఇంటింటికీ తిరిగి వలంటీర్లు నిర్వహించే పనులన్నీ సచివాలయ ఉద్యోగులనే బాధ్యులను చేసి పనులు చేయిస్తోంది. తాజాగా మరో అడుగు ముందుకేస్తూ బయోమెట్రిక్ అటెండెన్స్ కొందరికి సక్రమంగా లేదనే సాకుతో జిల్లావ్యాప్తంగా 1,829 మందికి నోటీసులు జారీ చేయడానికి రంగం సిద్ధం చేసింది.

విషం చిమ్ముతూ.. రాష్ట్రవ్యాప్తంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. పల్లె ముంగిటలోనే ప్రజలకు పౌర సేవలు అందాలని ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం కిలోమీటర్లు ప్రయాణించి తహసీల్దార్ల కార్యాలయాల చుట్టూ పడిగాపుల విధానానికి స్వస్తి పలికి.. వేలాది మంది నిరుద్యోగులకు శాశ్వత ప్రభుత్వ కొలువు చూపేలా సచివాలయ వ్యవస్థకు 2019 అక్టోబర్ 2న మహాత్మగాంధీ జయంతి రోజు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 142 పౌరసేవలతో ప్రారంభించి 527 రకాల సేవలను సచివాలయాల ద్వారా అందించారు. ఏలూరు జిల్లాలో 605 సచివాలయాల్లో 4,706 మంది శాశ్వత ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారం నుంచే కూటమి పార్టీ సచివాలయ వ్యవస్థపై విషం చిమ్మడం ప్రారంభించింది. తొలుత వలంటీర్లను టార్గెట్ చేసి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సచివాలయ వ్యవస్థతో అన్నీ ఇబ్బందులేనంటూ పలుమార్లు మాట్లాడి మళ్లీ ఓట్ల కోసం ప్లేట్ ఫిరాయించి వలంటీర్లను, సచివాలయ వ్యవస్థ కొనసాగిస్తామని ప్రకటించారు. కట్ చేస్తే.. కూటమి రాగానే వలంటీర్లకు మంగళం పాడి పింఛన్ పంపిణీ, హౌస్ జియో ట్యాగింగ్, బ్యాంకు ఖాతా ఆధార్ కార్డుకు అనుసంధానం వంటి సేవలను సచివాలయ సిబ్బందికి అప్పగించి పనిభారాన్ని రెట్టింపు చేశారు. వీటితో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో బాత్‌రూమ్‌లు శుభ్రంగా ఉన్నాయా లేదా అని ఫొటోలు కూడా అప్‌లోడ్ చేసే బాధ్యత కూడా వీరికే అప్పగించారు. తాజాగా నోటీసుల పేరుతో వేధించేలా రంగం సిద్ధం చేశారు. మరో రెండు రోజుల్లో నోటీసులు జారీ చేయనున్నారు.

1,829 మందికి షోకాజ్

జిల్లాలో 1,829 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. మండలాల వారీగా ఆగిరిపల్లిలో 80 మందికి, భీమడోలులో 63 మందికి, బుట్టాయగూడెంలో 59 మందికి, చాట్రాయిలో 44 మందికి, చింతలపూడిలో 108 మందికి, దెందులూరులో 37 మందికి, ద్వారకాతిరుమలలో 60 మందికి, ఏలూరులో 191 మందికి, జంగారెడ్డిగూడెంలో 89 మందికి, జీలుగుమిల్లిలో 26 మందికి, కైకలూరులో 71 మందికి, కలిదిండిలో 47 మందికి, కామవరపుకోటలో 27 మందికి, కొయ్యలగూడెంలో 69 మందికి, కుక్కునూరులో 39 మందికి, లింగపాలెంలో 64 మందికి, మండవల్లిలో 47 మందికి, ముదినేపల్లిలో 57 మందికి, ముసునూరులో 38 మందికి, నిడమర్రులో 41 మందికి, నూజివీడులో 116 మందికి, పెదపాడులో 85 మందికి, పెదవేగిలో 101 మందికి, పోలవరంలో 53 మందికి, టి.నరసాపురంలో 69 మందికి, ఉంగుటూరులో 96 మందికి, వేలేరుపాడులో 54 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఇలా సచివాలయ సిబ్బందిపై వేధింపులకు కూటమి సర్కారు ఉపక్రమించింది.

రెట్టించిన పనిభారం

ఇప్పటికే సచివాలయాల్లో కంప్యూటర్లు, స్కానర్లు, రిపేర్లకు గురయ్యాయి. గతంలో రిపేర్లు చేయడానికి చేసుకున్న కంపెనీ ఒప్పందం కాలపరిమితి ముగిసింది. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో సౌకర్యాలు లేవు. వీటితో పాటు బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్ డివైజులు కూడా సిబ్బంది వద్ద లేని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో పెన్షన్ పంపిణీ అప్పగించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ సచివాలయ సిబ్బంది వాటిని సైతం ఎదుర్కొంటూ పెన్షన్లు సజావుగా పంపిణీ చేస్తుంటే.. ఒక్క రోజులోనే సచివాలయ సిబ్బంది పెన్షన్ల పంపిణీ చేయాల్సిందేనంటూ హుకుం జారీ చేసింది. దీనిని సైతం విజయవంతంగా సచివాలయ సిబ్బంది పూర్తి చేస్తుండగా సర్వేల పేరు చెప్పి సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇప్పటికే వ్యవసాయశాఖ అసిస్టెంట్లు ధాన్యం కొనుగోలుకు క్షేత్రస్థాయిలో పొలాల వెంట తిరుగుతుండగా, వెటర్నరీ అసిస్టెంట్లు పాడిపశువుల సర్వేలో నిమగ్నమయ్యారు. ఇక సర్వే అసిస్టెంట్లు సర్వే రాళ్ల పేర్లు తొలగింపు ప్రక్రియలో నిమగ్నమవ్వగా ఏఎన్ఎంలు వైద్య సర్వే పనుల్లో ఉన్నారు. ఇదిలా ఉండగా మహిళా స్థితిగతుల సర్వే, ఇంటి పన్నుల నమోదు, ఆధార్ అనుసంధానం ఇలా సచివాలయ సిబ్బందిని సర్వేల పేరుతో కూటమి సర్కారు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూనే ఉంది.

న్యూస్‌రీల్

ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం



నూజివీడు ట్రిపుల్ఐటీలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొలుసు

నూజివీడు: నూజివీడును సాఫ్ట్‌వేర్ హబ్‌గా తీర్చిదిద్దుతానని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు ట్రిపుల్ఐటీలో ఏర్పాటు చేసిన పారబోలా 9 ఏఐ ఇంక్యుబేషన్ సెంటర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ట్రిపుల్ఐటీలో విద్యార్థుల నైపుణ్యాలను మరింత పెంచేలా పనిచేస్తున్నామన్నారు. ఈ సంస్థ ద్వారా ప్రస్తుతం 15 మంది విద్యార్థులను పూర్తిస్థాయి ఇంటర్న్‌లుగా, మరో 8 మందిని పార్ట్‌టైమ్ ఇంటర్న్‌లుగా తీసుకున్నారన్నారు. ట్రిపుల్ఐటీలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషిచేస్తానన్నారు. డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, ఏఓ బి. లక్ష్మణరావు, యూనివర్సిటీ డీన్ శ్రావణి, సీఏఓ బండి శ్యామ్ తదితరులు

ప్రొఫెసర్‌పై దాడి హేయం



వాసే ఆనందకుమార్

కామవరపుకోట: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎయిమ్ జిల్లా అధ్యక్షుడు వాసే ఆనందకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దళితులపై మతోన్మాద దాడులు ఎక్కువయ్యాయని, దళితుడనే అక్కసుతో చెంగయ్యపై దాడి చేయటం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఉన్నత ఉద్యోగంలో ఉన్న చెంగయ్య పరిస్థితే అలా ఉంటే, సామాన్య దళితుల పరిస్థితి ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రొఫెసర్ చెంగయ్యకు అండగా ఉంటామని తెలిపారు.

12 కేంద్రాల్లో ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న జరిగే పరీక్షకు జిల్లాలో 2,788 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, 12 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ మేరకు సిబ్బంది నియామకం పూర్తయ్యిందని, విద్యార్థులు హాల్‌టికెట్‌తో ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 10 గంటల తర్వాత అనుమతించరని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు, చేతి గడియారాలు, క్యాలిక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు.

మహిళా సాధికారత ధ్యేయం



మాట్లాడుతున్న డీపీఓ అనురాధ

ఏలూరు(మెట్రో): పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు గల, మహిళా స్నేహపూర్వక గ్రామాల సాధికారత దిశగా ప్రభుత్వ శాఖలు పనిచేయాలని డీపీఓ కె.అనురాధ కోరారు. నగరంలోని డీపీఆర్‌సీలో జరుగుతున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. మహిళల జీవితం, వృత్తికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమన్నారు. ప్రతి గ్రామంలో మహిళలకు స్నేహపూర్వకమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏపీఎస్ఐఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ ఎ.రమణ మాట్లాడుతూ స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ఆవశ్యకతను ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. 17 మండలాల నుంచి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగిరాజు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు సహకరించాలి

ఏలూరు(మెట్రో): కృష్ణా జిల్లా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుపై కలెక్టరేట్‌లో జిల్లా రైస్ మిల్లర్లతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో ఒక్కసారిగా పంట కోతలతో పెద్ద మొత్తంలో ధాన్యం పోగయ్యిందని, ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. రోజుకు సుమారు 1,000 టన్నుల సేకరణకు సహకరించాలని కోరారు. జేసీ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 23,761 మంది రైతుల నుంచి ఇప్పటివరకు 1,81,418 టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి వి.శ్రీలక్ష్మి, డీఎస్ఓ ఆర్ఎస్ఎస్ రాజు, ఉపరవాణా కమిషనర్ ఎస్‌కే కరీమ్ పాల్గొన్నారు.

టీడీపీ నేత ఆక్రమణపై నిరసన



జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెం మాదిగపేటలో రచ్చబండను ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్కినవారిగూడెంలో తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తి తడికమల్ల పాంచాట్టయ్య గ్రామంలో ఉన్న రచ్చబండను అన్యాక్రాంతంగా ఆక్రమించి అక్రమ నిర్మాణం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్యాక్రాంతంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని సీరియస్‌గా చెబుతున్నా కొందరు భూస్వాముల అండ చూసుకొని రిజిస్ట్రేషన్ చేయించి ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బయ్యారం మాదిగ మాట్లాడుతూ రచ్చబండ ఆక్రమించిన వారు ఎంతటి వారైనా వారికి సహకరిస్తున్న పెత్తందారులపైనా పోరాటం చేస్తామన్నారు. ఈ సంఘటనపై విచారణ చేయాలని కోరారు. ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నేత విస్సంపల్లి సిద్దు మాదిగ, ఎంఎస్‌పీ మండల నాయకులు తుట్టి ఈశ్వరరావు దొర, తడికమల్ల ఆనందరావు, ముదగ్గల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పీటీఎంలు

కలెక్టర్ వెట్రిసెల్వి



ఏలూరు(మెట్రో): జిల్లాలో శనివారం జరుగనున్న జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం (పీటీఎం)లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాల్గొనాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం పీటీఎం ఏర్పాట్లపై ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 1,788 పాఠశాలల్లో ఉదయం 9 గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు. ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చిస్తారన్నారు. పండుగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తారని, ప్రోగ్రెస్ కార్డులు అందిస్తారని చెప్పారు.

సైనికులకు శుభాకాంక్షలు : దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన సైనికులను స్మరించుకునేందుకు ఏటా డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే) నిర్వహిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సైనికులు, యుద్ధ వితంతువులు, మాజీ సైనికులు, మాజీ సైనిక వితంతువులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్



కైకలూరు: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్



నిడమర్రు: అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మండలి చైర్మన్ మోషేనురాజు

కైకలూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన జీవించి ఉంటే కూటమి ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పేవారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. పట్టణంలోని ఏలూరు రోడ్డులో పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర గొప్పదన్నారు. ఆయన స్ఫూర్తిని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అమలు పర్చారన్నారు. అనంతరం దళితుల సంక్షేమానికి ఆయన కుమారుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారన్నారు. జగన్ నవరత్నాలతో పాటు మరెన్నో పథకాలను సచివాలయాల ద్వారా అమలు చేశారన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజల సమస్యలు చూసి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ జనవరి చివరి వారం నుంచి ప్రజల మధ్యకు వస్తున్నారన్నారు. ధాన్యం మద్దతు ధర, కరెంటు చార్జీల పెంపు వంటి అంశాలపై దశలవారీ ఆందోళనలు చేస్తామన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామన్నారు. ఎంపీటీసీలు సాధు కొండయ్య, పట్టపు బాలమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు ఎస్.శ్యామ్‌సుందర్, నాయకులు పంజా రామారావు, బలే నాగరాజు, విజయ్‌కుమార్, సమయం అంజి, లాజరు, బూరుబోయిన మోహనరావు, రఫి, చిన్నరాజు, మురళీ, సుధాకర్, విజయ్ ఆనంద్, జాషువా పాల్గొన్నారు.

మండలపర్రులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

నిడమర్రు: బడుగు, బలహీన వర్గాల కోసం హక్కులను కల్పించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. మండలపర్రు గ్రామంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలిలో మాజీ టీటీడీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ కేంద్ర కమిటీ సభ్యులు గాదిరాజు వెంకట సుబ్బరాజు (పెదబాబు) రూ.2 లక్షల ఆర్థిక సాయంతో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని సుబ్బరాజుతో కలిసి మోషేనురాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరూ కృషిచేయాలన్నారు. ఎంపీటీసీ ముదునూరి త్రివేణి, సర్పంచ్ దెందుకూరి త్రిమూర్తిరాజు పాల్గొన్నారు.

సమాన హక్కులు కల్పించిన నాయకుడు

నూజివీడు: దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించి ప్రజలందరికీ సమాన హక్కులను కల్పించిన గొప్ప నాయకుడు బీఆర్ అంబేడ్కర్ అని గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలు అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని కోరారు.

హోంగార్డుల సంక్షేమానికి కృషి



హోంగార్డులకు ప్రతిభా అవార్డులు అందిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: జిల్లాలో హోంగార్డుల సంక్షేమానికి కృషిచేస్తున్నామని రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో హోమ్‌గార్డ్స్ ఆర్గనైజేషన్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ, ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు పోలీసు శాఖకు వెన్నెముకలా నిలిచి ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నారన్నారు. జిల్లాలో 404 మంది హోంగార్డులు పనిచేస్తున్నారని చెప్పారు. కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీలో వీరికి రిజర్వేషన్ కల్పిస్తున్నామన్నారు. హోంగార్డుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఈ ఏడాదిలో 12 మంది హోంగార్డులు పదవీ విరమణ చెందగా, ఏడుగురు మరణించారని చెప్పారు. వారికి ప్రభుత్వం తరఫున ఎక్స్‌గ్రేషియా రూపంలో ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఇద్దరికి అందజేశామన్నారు. పదవీ విరమణ పొందిన హోంగార్డులకు స్వచ్ఛందంగా ఇచ్చిన హోంగార్డుల ఒక రోజు వేతనం మొత్తం రూ.26,96,580లు అందజేశామన్నారు. అలాగే మరణించిన హోంగార్డుల కుటుంబాలకు రూ.32,52,510 అందించామని చెప్పారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కవాతులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి జ్ఞాపికలు అందజేశారు. జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఎస్బీ సీఐలు మల్లేశ్వరరావు, బోనం ఆదిప్రసాద్, డీటీసీ డీఎస్పీ సీహెచ్ ప్రసాదరావు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

కథోలిక న్యాయవాదుల సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న బిషప్ జయరావు

పెదవేగి: వృత్తిరీత్యా కథోలిక న్యాయవాదులు మరింత అవగాహన పెంచుకోవాలని ఆర్సీఎం ఏలూరు పీఠాధిపతి, విశాఖ అగ్రపీఠ పాలనాధికారి పొలిమేర జయరావు అన్నారు. మండలంలోని సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీలో శుక్రవారం రాత్రి కథోలిక న్యాయవాదుల జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. విజయవాడ పీఠాధిపతి తెలగతోటి రాజారావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెండు రోజులపాటు సదస్సు జరుగుతుందని పీఆర్వో ఫాదర్ టి.ఇమ్మానియేల్, నిర్వహణ బృంద సభ్యులు ఫాదర్ బాల, ఫాదర్ జి.మోజెస్, ఫాదర్ ఇన్ జయపాల్, ఫాదర్ పి.జాకబ్, ఫాదర్ బాబు జార్జ్ పాల్గొన్నారు.

క్షేత్రంలో మినీ బైపాస్ నిర్మాణం



నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో గరుడాళ్వార్ సెంటర్ నుంచి సొసైటీ సూపర్‌బజార్ వరకు మినీ బైపాస్ రహదారి నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దాదాపు రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టగా గరుడాళ్వార్ విగ్రహ కూడలి నుంచి పనులను ప్రారంభించారు. పొక్లయిన్‌తో ధ్వంసమైన పాత సీసీ రోడ్డును తొలగిస్తున్నారు. క్షేత్రంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎస్సై టి.సుధీర్ చర్యలు చేపట్టారు. భీమడోలు వైపు నుంచి కామవరపుకోట వైపునకు వాహనాలు గరుడాళ్వార్ సెంటర్ సమీపంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు (వెంకటకృష్ణాపురం) వైపు నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా వెళ్లాలని సూచించారు. శ్రీవారి కొండపైకి వెళ్లేవారు ఎప్పటిలా గరుడాళ్వార్ సెంటర్ నుంచి వెళ్లవచ్చన్నారు. స్వామివారి దర్శనార్థం బస్సుల ద్వారా వచ్చే భక్తులు గరుడాళ్వార్ సెంటర్‌లో దిగి ఆలయానికి వెళ్లాలన్నారు. రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వన్‌వే నిబంధనలు అమలవుతాయన్నారు. సిబ్బందితో కలిసి ఆయన పర్యవేక్షించారు.

విద్యుత్ మీటర్ల బిగింపు

సాక్షి స్పందన



రెడ్డిగణపవరంలో తొలగించిన స్థానంలో తిరిగి మీటర్లను బిగించిన దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం గ్రామంలో ఇటీవల దళితుల ఇళ్లల్లో విద్యుత్ అధికారులు తొలగించిన విద్యుత్ మీటర్లను శుక్రవారం ఉదయం తిరిగి బిగించారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వాడుకునే జీఓ గత ప్రభుత్వం అమలు చేయగా కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించాలంటూ విద్యుత్ మీటర్లు తొలగించింది. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురించగా అధికారులు స్పందించారు. తొలగించిన మీటర్లను తిరిగి మరలా బిగించారు. అయితే తాము తొలగించలేదని 'సాక్షి' అసత్య ప్రచారాలు చేస్తుందంటూ చెప్పాలని దళితులను అధికారులు కోరగా.. దళితులు నిరాకరించారు. ఇక చేసేదిలేక అధికారులు మీటర్లు బిగించి వెళ్లిపోయారని బాధితులు అన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రు మాల్యాద్రి, ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, బాధితులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

పోలవరంలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్



సూచనలిస్తున్న అధికారులు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టులో రాష్ట్ర ఆక్టోపస్ పోలీసులు శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద దాడి జరిగినప్పుడు, అసాంఘిక శక్తులు విజృంభించినప్పుడు భద్రతా బలగాల సంసిద్ధతను పరీక్షించే లక్ష్యంతో జరిగిన ఈ కసరత్తును ఆక్టోపస్ సీనియర్ పోలీసు అధికారులు పర్యవేక్షించారు. పోలీసులు, ప్రాజెక్టు భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీఎస్ సిబ్బంది, ప్రాజెక్టు నిర్మాణ సంస్థ ఎంఈఐఎల్ సిబ్బంది సహకారంతో డ్రిల్ కొనసాగింది. ఆయుధ సంపత్తితో దాడులను ఎలా ఎదుర్కొంటారో పోలీసులు ప్రదర్శించారు. ఆక్టోపస్ విభాగం డీఎస్పీ తిరుపతి మాట్లాడుతూ ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు ఆక్టోపస్ పోలీసుల సంసిద్ధతను అంచనా వేయడానికి మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. ఇది నిరంతరం కొనసాగుతుందన్నారు. మాక్ డ్రిల్‌లో పోలవరం పోలీసులు, ప్రాజెక్టు భద్రతను పర్యవేక్షించే ఎస్పీఎఫ్ సిబ్బందితో ఆక్టోపస్ పోలీసుల బృందం సమావేశమైంది. పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, ఎస్పీఎఫ్ సీఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ ఆశయాలకు కూటమి తూట్లు



వల్లూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న ఆనందప్రకాష్

పెనుగొండ : పేదల సంక్షేమాన్ని మరిచి, దళితులకు అన్యాయం చేస్తూ కూటమి ప్రభుత్వం బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తుందని ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్ విమర్శించారు. వల్లూరు చింతపర్తివారి పాలెంలో మాజీ సర్పంచ్ నీతిపూడి భాగ్యలక్ష్మీ వెంకట్రావు దంపతుల సహకారంతో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల అమలుపై కూటమి దోబూచులాడుతుందన్నారు. ఎన్నో హామీలు, ఆశలు పెడుతూ పేదలను మభ్యపెట్టిందన్నారు. పేదల అభ్యున్నతికి అంబేడ్కర్ మార్గ నిర్దేశం చేశారన్నారు. వాటికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడించిదన్నారు. రాష్ట్రంలో దళితులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతమన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చింతపర్తి మాధవరావు, చింతపర్తి రాజు, చదలవాడ యేసు, ఖండవల్లి ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక ప్యాకేజీ

ఏలూరు (టూటౌన్): ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జనవరి 19 నుంచి 26 వరకు మహాకుంభ మేళా పుణ్య క్షేత్ర యాత్రను నిర్వహిస్తున్నట్లు విజయవాడ ఏరియా మేనేజర్ ఏ.రాజా ఒక ప్రకటనలో తెలియజేసారు. వారణాసి, అయోధ్య, ప్రయాగ్ రాజ్ పుణ్యక్షేత్రాలను దర్శించవచ్చునన్నారు. జనవరి 19 నుంచి 26 వరకు ఏడు రాత్రులు, ఎనిమిది రోజులు ఈ యాత్ర సాగుతుందన్నారు. జనవరి 19న సికింద్రాబాద్‌లో ప్రారంభమయ్యే రైలు విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని స్టేషన్లలో ఆగుతుందన్నారు. టిక్కెట్ ధర పెద్దలకు స్లీపర్ క్లాస్ రూ.22,635, థర్డ్ ఏసీ రూ.31,145, సెకండ్ ఏసీ రూ.38,195 పిల్లలకు స్లీపర్ క్లాస్ టిక్కెట్ రూ.21,740, థర్డ్ ఏసీ రూ.30,095, సెకండ్ ఏసీ రూ.36,935గా నిర్ణయించామన్నారు. టీ, అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం అందిస్తారన్నారు. పూర్తి వివరాలకు ఐఆర్‌సీటీసీ విజయవాడ నంబర్లు 9281495848, 8977314121 లో సంప్రదించాలన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం.. కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం కేతవరం గ్రామానికి చెందిన కొసనం దివ్యకు 2019లో వివాహమైంది. టి.నరసాపురం మండలం బండివారిగూడెంకు చెందిన నల్లకాసుల లీలా కృష్ణకు, దివ్యకు 2022లో జంగారెడ్డిగూడెం బస్టాండ్‌లో పరిచయం ఏర్పడింది. లీలా కృష్ణ ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటానని దివ్యను నమ్మించాడని, ఈ క్రమంలో దివ్య భర్త నుంచి విడాకులు తీసుకుని, లీలా కృష్ణను పెళ్లి చేసుకోవాలని కోరిందన్నారు. పెళ్లి చేసుకోవడానికి లీలాకృష్ణ నిరాకరించాడని, దీంతో తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ లీలాకృష్ణపై దివ్య ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఈసారైనా పదిలమేనా ?

- పది ఫలితాల్లో పురోగతి సాధ్యమేనా?
- నూరు రోజుల ప్రణాళికపై ఉపాధ్యాయుల అసంతృప్తి
- ఇంకా పూర్తి కాని సిలబస్
- ఇంతవరకూ అందని విజయకేతనం బుక్‌లెట్



పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు (ఫైల్)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : పదో తరగతి పరీక్షలు దగ్గరకు వచ్చేస్తున్నాయి. మార్చి లేదా ఏప్రిల్‌లో పరీక్షలు జరిగే అవకాశముందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యం ఉన్నా.. లక్ష్యాన్ని చేరుకునే మార్గాలు మూసుకుపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నూరు రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీనిని ఉపాధ్యాయ సంఘాలన్నీ వ్యతిరేకించాయి. అయినా మెడ మీద కత్తి పెట్టి మరీ ఈ ప్రణాళిక అమలు చేయిస్తున్నారు. ఇటీవల పాఠశాలల సమయాలను పెంచడంపై కూడా ఉపాధ్యాయ సంఘాలు గుర్రుగా ఉన్నాయి.

దపో తరగతి పరీక్షలు అంటేనే జిల్లా విద్యాశాఖాధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గతంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన చరిత్ర నుంచి 2022–23 విద్యా సంవత్సరంలో 23వ స్థానం, 2023 – 24లో 25వ స్థానానికి పతనమైంది. ఈ ఏడాదైనా స్థానాన్ని మెరుగుపరుచుకునే పరిస్థితి ఉందా అంటే ప్రశ్నార్థకంగానే మారింది. ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలతో పాటు స్థానిక పరిస్థితులు కూడా పది ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముందంటున్నారు.

నూరు రోజుల ప్రణాళిక సత్ఫలితాలిచ్చేనా..

పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతం పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర విద్యాశాఖ నూరు రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 1 నుంచి ఫిబ్రవరి సగం వరకూ ఈ ప్రణాళిక అమలులో ఉంటుంది. ఈ ప్రణాళిక ప్రకారం 10వ తరగతి విద్యార్థులకు ప్రతీ రోజూ షెడ్యూల్ ప్రకారం నిర్వహించే తరగతులతో పాటు అదనంగా మరో రెండు తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. ఉదయం 9 గంటలకు పాఠశాలలు తెరిచే లోపు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ఒక అధ్యయన తరగతి, తిరిగి పాఠశాలలు విడిచిపెట్టిన తరువాత సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ మరో అధ్యయన తరగతి నిర్వహించాల్సి ఉంటుంది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నాయి. ఏకధాటిగా తొమ్మిది గంటల పాటు విద్యార్థులను తరగతులకు పరిమితం చేయడం వల్ల వారు మానసికంగా కుంగిపోతారని, అన్ని గంటల పాటు అభ్యసనపై దృష్టి కేంద్రీకరించలేరని చెబుతున్నారు. ఇప్పటికే రెసిడెన్షియల్ శిక్షణ పేరిట ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహించిన తరగతుల కారణంగా ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు ఒత్తిడికి లోనై మృతి చెందిన విషయాన్ని ఈ సందర్భంగా వారు ప్రస్తావిస్తున్నారు.

పూర్తి కాని సిలబస్

ఇదిలా ఉండగా విద్యాశాఖ రూపొందించిన క్యాలెండర్ షెడ్యూల్ ప్రకారం పదో తరగతి సిలబస్ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ షెడ్యూల్ ప్రకారం జనవరి మాసాంతం వరకూ సిలబస్ చెప్పాల్సిన అవసరం ఉంది. సిలబస్ పూర్తి కాకుండా నూరు రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తే ఆచరణ ఎలా సాధ్యమంటూ ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. గతంలో కూడా ఇలాంటి ప్రత్యేక ప్రణాళిక అమలు చేసినా సిలబస్ అయిన తరువాత నుంచి మాత్రమే అమలు చేశారని గుర్తు చేస్తున్నారు.

అన్ని సబ్జెక్టుల్లో ముఖ్యమైన ప్రశ్నలు, జవాబులతో ఏటా రూపొందించే విజయకేతనం సిలబస్ బుక్‌లెట్ ఈ ఏడాది ఇప్పటి వరకూ ప్రింటింగ్ పూర్తి కాలేదు. కనీసం బుక్‌లెట్ దగ్గర ఉన్నా విద్యార్థికి పరీక్షల్లో ఎదురయ్యే ప్రశ్నలపై ఒక అవగాహన కలుగుతుందని అంటున్నారు. బుక్‌లెట్ ముద్రణ మరింత సమయం తీసుకునేలా ఉంది. విజయకేతనం బుక్ విద్యార్థి చేతిలో ఉంటే విద్యార్థిలో మనోస్థైర్యం పెరుగుతుందని, అది ఫలితాల్లో కూడా ప్రతిబింబించే అవకాశం ఉందంటున్నారు.

సెలవు దినాల్లో కూడా తరగతులా?



విద్యాశాఖ రూపొందించిన నూరు రోజుల కార్యాచరణ ప్రణాళికలో ఆదివారాలు, సెలవు దినాలు, పండుగల్లో సైతం అధ్యయన తరగతులు నిర్వహించాలన్నారు. ఆదివారాలు, సెలవు దినాల్లో విద్యార్థులు ప్రశాంతంగా ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా గడపడానికి ఇష్టపడతారు. అలాంటి వేళల్లో విద్యార్థులను అధ్యయన తరగతులకు తీసుకురావడం కష్టం. స్థానిక పరిస్థితులకు తగ్గట్టుగా కార్యాచరణ రూపొందించుకునే వెసులుబాటు ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు కల్పించాలి.

– పువ్వుల ఆంజనేయులు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు



విధి నిర్వహణలో ఇప్పటికే ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. అపార్ నమోదు, యాప్‌లలో ఫొటోలు అప్‌లోడ్ చేయడం వంటి పనులతో తలమునకలుగా ఉంటున్నారు. రెసిడెన్షియల్ శిక్షణ తరగతుల కారణంగా కొంతమంది ఉపాధ్యాయులు అనారోగ్యం పాలయ్యారు. దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమయ్యేవారు, కుటుంబంలో వృద్ధుల అవసరాలు తీర్చాల్సిన వారు ఉన్నారు. అటువంటి వారికి అదనంగా తరగతులు నిర్వహించడం కష్టసాధ్యం. దీనిపై విద్యాశాఖాధికారులు పునరాలోచించాలి.

– గెడ్డం సుధీర్, వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కోడిపందేలపై దాడి



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నరసాపురం రూరల్: ఎస్పీ ఆదేశాల మేరకు నరసాపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత నవరసపురం గ్రామంలో పాలకొల్లు రూరల్, నరసాపురం రూరల్ పోలీసులు సంయుక్తంగా గురువారం రాత్రి దాడి చేశారు. కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 16 మందిని అదుపులోకి తీసుకున్నామని రూ.3.31లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. జూదం, కోడి పందేలు వంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇసుక రవాణాపై రచ్చ

కొయ్యలగూడెం: ఇసుక రవాణాపై ఇరు వర్గాల మధ్య తగాదా చినికి చినికి గాలివానలా మారింది. శుక్రవారం మధ్యాహ్నం గవరవరం వద్ద ఇసుక ట్రాక్టర్ల రవాణా దారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. నల్లజర్ల మండలం సుభద్ర పాలెం వద్ద ఉన్న ఇసుక ర్యాంపునకు రానివ్వడం లేదంటూ కొయ్యలగూడెం మండలంకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు ఆందోళనకు దిగారు. నల్లజర్ల మండలానికి చెందిన ఇసుక ట్రాక్టర్లును కొయ్యలగూడెం మండలంలోకి రానివ్వమంటూ వాటిని అడ్డుకున్నారు. దీంతో రెండు మండలాలకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లకు యజమానులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అప్పటికే పోతవరం మీదుగా ఇసుకతో కొయ్యలగూడెం వస్తున్న సుమారు పది ట్రాక్టర్లను నిలిపివేసి ఘర్షణకు దిగారు. తమ ట్రాక్టర్లను కూడా ఇసుక రవాణాకు అనుమతించాలని వారు వాదించారు. ఇరువర్గాలు సఖ్యతతో మెలిగితే ఇబ్బందులు ఉండవని లేని పక్షంలో నష్టపోవాల్సి ఉంటుందని మధ్యవర్తులు సూచించారు. దీంతో పోతవరంలో శనివారం చర్చించుకోనున్నట్లు తెలిపారు.

బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక



విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైన విద్యార్థినిలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): త్వరలో జరుగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడల్లో భాగంగా జరిగే బాస్కెట్ బాల్ పోటీల్లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరఫున ఆడే జట్టు ఎంపిక పోటీలు నెల 5, 6 తేదీల్లో స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీల సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ క్రీడాకారుల్లో ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. క్రీడల ద్వారా విద్యార్థినులు తమ నైపుణ్యాలను, ప్రతిభా పాటవాలను మెరుగుపరచుకోవచ్చన్నారు. బాస్కెట్ బాల్ టోర్నమెంట్లో విజేతలుగా సెయింట్ థెరెసా కళాశాల జట్టు నిలవగా, గోపన్నపాలెం ఎస్ఎస్ఆర్ జీసీపీఈ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రతినిధిగా ఎంవీఎస్ఎస్ మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులుగా బాపిరెడ్డి, వీరబాబు వ్యవహరించారు. ఈ టోర్నమెంట్లో ఎంపికైన క్రీడాకారిణులు ఈ నెల 20 నుంచి కొట్టాయంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ విమెన్ టోర్నమెంట్ నన్నయ విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.

నిలిచిన గుండుగొలను వంతెన పనులు

- శివారు రైతుల ఆందోళనతో మళ్లీ మొదటికి
- దాళ్వా సీజన్ పూర్తయ్యే వరకు పనులు సాగని వైనం



గుండుగొలనులో వంతెన ఐరన్ ఊచలు తుప్పపడుతున్న దృశ్యం



నీటి ప్రవాహం వద్ద తూరలు అమర్చుతున్న దృశ్యం

భీమడోలు : గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై నిర్మిస్తున్న వారధి నిర్మాణానికి అడుగుడుగునా ఆటంకాలు ఏర్పడుతున్నాయి. సార్వా, దాళ్వాకు సాగు నీరు అవసరం లేని సమయంలో తూరలు పెట్టి పనులు చేపడతామని చెప్పి పనులు ప్రారంభించారు. ఇప్పుడు దాళ్వా సీజన్‌లో తూరలు ఏర్పాటు చేసి నీటి ప్రవాహానికి ఆటంకం పెట్టి ఆయకట్టును బీడు చేస్తారా అంటూ దెందులూరు మండలంలోని శివారు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కాల్వలో తూరలు ఏర్పాటు చేయడం వల్ల నీటి ప్రవాహం తగ్గి తమ ప్రాంతంలోని 35 నుంచి 40 వేల ఎకరాల దాళ్వా పంటకు సాగునీటి కొరత ఏర్పడుతుందని, నారుమడులు వేశామని కాల్వలో నీటి ప్రవాహం తగ్గిందని శివారుకు నీరు రాకుంటే పరిస్థితి ఏంటని జలవనరుల శాఖ ఉన్నతాధికారులను ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని దాళ్వా సీజన్ అయ్యేంత వరకు ఉపసంహరించుకోవాలని శివారు గ్రామాలైన సత్యనారాయణపురం, పాలగూడెం, పోతునూరు, కొవ్వలి తదితర గ్రామాల రైతులు జలవనరుల శాఖ అధికారులు వద్ద ఆందోళన చేయడంతో పనులు తాత్కాలికంగా నిలిపి వేశారు.

పరిష్కారం కాని వంతెన నిర్మాణం

గుండుగొలనులో 120 ఏళ్ల కితం నిర్మించిన వంతెన రెండేళ్ల కితం కూలిపోయింది. దీంతో భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, కైకలూరు మండలాలకు చెందిన 15 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తీసుకు వెళ్లి బెయిలీ వంతెనను నిర్మించి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. కొత్త వంతెన నిర్మాణానికి రూ.4 కోట్లను మంజూరు చేయించారు. 50 శాతం పనులు పూర్తి చేశారు. ఇప్పటికే ఆర్‌సీసీ గడ్డర్లు సిద్ధంగా ఉన్నా సాగు నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా బిగించే పనులు నిలిచిపోయాయి. అయితే ఐరన్ ఊచలు తుప్పు పట్టిపోతున్నాయి. దీంతో నాణ్యతా ప్రమాణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తి కావాలంటే కాల్వ కొన్ని రోజులు పాటు మూసేస్తేనే తప్ప పనులు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడిందని కాంట్రాక్టర్, జలవనరుల శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల సాక్షిలో కథనం, గ్రామస్తుల ఆందోళనల నేపథ్యంలో పనుల్లో కదలిక మొదలయ్యాయి. సార్వా సీజన్ ముగియగానే కాల్వలో తూరలు ఏర్పాటు చేసి వంతెన నిర్మిస్తామని కొన్ని రోజులు అధికారులు నిర్ణయించారు. ఆందోళనతో పనులు మొదటికి వచ్చాయి.

కాల్వ పరిధిలోని దెందులూరు మండలం, భీమడోలు మండలాలకు చెందిన రైతులు, పెద్దలకు అధికారులు తెలియజేసి వారి అభిప్రాయాలను తెలుసుకుంటే సమస్య ఇంత వరకు వచ్చేది కాదని పలువురు అంటున్నారు. సార్వా సాగు ముగియగానే గడ్డర్లు ఏర్పాటు చేసుకునేలా ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో మూడు మీటర్ల గల 20 ఐరన్ తూరలు తీసుకు వచ్చారు. భారీ క్రేన్‌లతో పనులు చేపట్టారు. రైతుల ఆందోళనతో పనులు నిలిచిపోయాయి.

బెయిలీ వంతెనపై భయం భయంగా ప్రయాణం

బెయిలీ వంతెన ప్రారంభోత్సవంలో కాల పరిధి రెండేళ్లే అని తెలిపారు. గడువు తీరింది. అధిక లోడు వాహనాల రాకపోకలు సాగించడంతో రేకుల నట్లు ఊడి బ్రిడ్జి బలహీన పడుతుంది. దీంతో వంతెనపై ప్రయాణం భయం భయంగా సాగుతుంది. రేకులు పాడైతే స్థానిక ఉప సర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు వాటికి మరమ్మతులు చేయించారు. వంతెన నిర్మించకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

వంతెన పనులు నిలిపివేయడం బాధాకరం



తూరలు ఏర్పాటు పనులను నిలిపివేయడం బాధకరం. కొన్ని రోజుల్లో ఈ సమస్య పరిష్కారమవుతుందని అందరూ భావిస్తున్న తరుణంలో పనులు ఆపారు. వంతెన నిర్మాణం అలస్యమవడంతో ఎందరో రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. జలవనరుల శాఖ అధికారులు శివారు రైతులకు నీటి ప్రవాహనికి ఎటువంటి ఇబ్బంది ఉండదని రైతులకు చెప్పి వారిని ఒప్పిస్తే బాగుండేది.

– కర్రి గంగాధరావు, గ్రామస్తుడు, గుండుగొలను

10న విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు

భీమవరం: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల సందర్భంగా 10న డీఎన్నార్ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బి.రామ్ కుమార్ తెలిపారు. మూడు చక్రాల రిక్షా రేస్, జావెలిన్ త్రో, షాట్‌పుట్ పోటీలు, దృష్టి లోపం కలిగిన వారికి పరుగు పందెం, షాట్‌పుట్, క్రికెట్ (సీనియర్స్), బధిరులకు పరుగు పందెం, షాట్‌పుట్, క్యారమ్స్, మానసిక వైకల్యం కలిగిన వారికి పరుగు పందెం, సాఫ్ట్‌బాల్, డిస్కస్ త్రో తదితర క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు.

చందన బ్రదర్స్ వార్షికోత్సవాలు ప్రారంభం



ఏలూరు చందన బ్రదర్స్‌లో వినియోగదారుల సందడి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఏలూరు చందన బ్రదర్స్‌లో 24వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆఫర్లతో ఎక్స్‌ప్రెస్ సేల్ పేరిట నిర్వహించిన అమ్మకాలను మొదటగా వాసవి సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో చందన బ్రదర్స్ వస్త్ర దుకాణం సరసమైన ధరలకు అన్ని రకాల వస్త్రాలను అందించడం ప్రత్యేకత అన్నారు. మేనేజర్లు జగదీష్, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నగరంలో తమ షాపులో వార్షికోత్సవం సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు పెట్టామన్నారు. బంగారు ఆభరణాలపై వార్షికోత్సవం సందర్భంగా తక్కువ తరుగు ఉంటుందన్నారు. రెగ్యులర్ సిల్వర్ ఆర్టికల్స్‌పై తరుగు, మజూరీ లేదన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అభివృద్ధి



అల్గారిథమ్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సులో ప్రొఫెసర్లు

భీమవరం: అభివృద్ధికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దోహదం చేస్తుందని ఎన్ఐటీ రాయపూర్ సీఎస్ఈ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్ సింగ్ పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు అల్గారిథమ్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పేరిట జరిగిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం సాయంత్రం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ప్రదీప్ సింగ్ మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీతో అణు విద్యుత్ కేంద్రాలు కూడా నిర్మాణం జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రతి మనిషి జీవన ప్రగతిలో ఏఐ ఎంతగానో దోహదపడుతుందన్నారు.

కొబ్బరి బొండాలకు కొత్త మెషీన్



కొబ్బరి బొండాలు నరకాలంటే ఒకప్పుడు కత్తి వాడేవారు. అలవాటయితే తప్ప కొత్త వారికి కొబ్బరి బొండం కొట్టడం కష్టంగా ఉండేది. అయితే ఇప్పుడు బొండాలు కొట్టే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. గ్రామాల్లో కొబ్బరి బొండాల్ని యంత్రంతో నరికి దానికి రంధ్రం పెట్టి ఇస్తున్నారు. గ్రామాల్లో అందుబాటులోనికి వచ్చిన ఈ యంత్రాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు. కొబ్బరి బొండం నరికే మెషీన్ వీరవాసరం మండలం పంజా వేమవరంలో దర్శనమిచ్చింది.

– భీమవరం

బైక్ దొంగ అరెస్ట్



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బైకులు

పాలకోడేరు : గురువారం సాయంత్రం కోరుకొల్లు శ్మశాన వాటిక సమీపంలో ఉన్న ఖాళీ స్థలం వద్దకు సిబ్బందితో వెళ్ళగా జీగా తేజ (19) అనే యువకుడు వివిధ చోట్ల చోరీ చేసిన బైక్‌లతో పట్టుబడ్డాడని పాలకోడేరు ఎస్సై మంతెన రవివర్మ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి, అతని నుంచి ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ 5.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

బంధన్ బ్యాంకులో గోల్‌మాల్

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెంలోని బంధన్ బ్యాంకు రుణాల సొమ్మును బ్యాంకు మేనేజరు, సిబ్బంది కాజేసారంటూ ఖాతాదారుల ఆందోళనతో బ్యాంకు వద్ద శుక్రవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం బ్యాంకు వద్దకు చేరుకుని మేనేజరు శివ, సిబ్బందిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం బ్యాంకు ద్వారా రుణాలు పొందిన ఖాతాదారులకు పూర్తి సొమ్ములు ఇవ్వకుండా నెలల తరబడి బ్యాంకు చుట్టూ తిప్పుతున్నారని ఖాతాదారులు ఆందోళన చేపట్టారు. కొంతమంది రుణగ్రస్తులకు రుణ సొమ్ములు అందించకుండానే రుణాల బకాయిలను చెల్లించాలంటూ వాయిదాలు వసూలు చేశారు. దీంతో ఖాతాదారులు తమకు రుణాలు ఇవ్వకుండా రుణ వాయిదాలను చెల్లించాలని ఇళ్లకు వచ్చి హడావుడి చేయడంతో ఖాతాదారులు శుక్రవారం రాత్రి బ్యాంకు మేనేజరును నిలదీశారు. ఖాతాదారులు ఆందోళనకు దిగారు. బ్యాంకు మేనేజరు, సిబ్బందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని, పూర్తి వివరాల అనంతరం ఖాతాదారులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.